క్లుప్తంగా

ఆదర్శ పాఠశాల పరీక్ష ప్రశాంతం

గండేడ్/మహమ్మదాబాద్: ఉమ్మడి మండల ఆదర్శ పాఠశాలలో చేరేందుకు ఏర్పాటు చేసిన ప్రవేశపరీక్ష ప్రశాంతంగా ముగిసినట్టు ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ శివకుమార్ తెలిపారు. ఆదివారం వెన్నాచేడ్ మోడల్ స్కూల్‌లో 5వ, 7వ తరగతుల ప్రవేశాలకు పరీక్షను నిర్వహించామన్నారు. ఈసందర్భంగా 5వ తరగతికి 320 మంది దరఖాస్తులు చేసుకోగా 235మంది హాజరయ్యారు. 7వతరగతికి సంబంధించి 252మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 196మంది పరీక్షకు హాజరయ్యారు.

పరిశీలకుడిగా మహ్మద్ అక్బర్

స్టేషన్ మహబూబ్‌నగర్: రానున్న పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా కాంగ్రెస్ మైనార్టీ విభాగం మహబూబ్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గ పరిశీలకుడిగా జిల్లా కేంద్రానికి చెందిన మహ్మద్ అక్బర్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆలిండియా కాంగ్రెస్ మైనార్టీ విభాగం వైస్ చైర్మన్, తెలంగాణ ఇన్‌చార్జీ ఫర్హాన్ అజ్మీ నియామక ఉత్తర్వులు జారీ చేశారు. మహ్మద్ అక్బర్ మాట్లాడుతూ బాధ్యతలు అప్పగించడంపై నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు సమావేశం

గండేడ్: పరిగిలో కాంగ్రెస్ పార్టీ బూత్ ఎన్రోలర్స్ సమావేశం సోమవారం ఉంటుందని గండేడ్ మండల అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, చెవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి రంజిత్‌రెడ్డి హాజరవుతారని ఆయన తెలిపారు.అన్ని గ్రామాల నుంచి బూత్ ఎన్రోలర్స్, ఏజంట్లు హాజరు కావాలని సూచించారు.

నెలాఖరు వరకు గడువు

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటి పరిధిలో ఆస్తిపన్ను ముందస్తుగా చెల్లిస్తే 5శాతం రాయితీ కల్పిస్తున్నామని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ ఎస్.రాజయ్య తెలిపారు. మార్చి 31తో 2023–24 పన్ను చెల్లింపు ముగిసిందని, 2024–25 ఏడాదికి సంబంధించిన పన్ను చెల్లించేందుకు ఈనెల 30వతేది వరకు గడువు ఉందన్నారు. పట్టణవాసులు ముందస్తు పన్ను చెల్లించి 5 శాతం రాయితీ పొందాలని సూచించారు.

పంచాయతీరాజ్ ఏఈఈ మృతి

అడ్డాకుల: మండలంలో పని చేసిన పంచాయతీరాజ్ ఏఈఈ వేణుగోపాల్‌రెడ్డి(38) మృతి చెందాడు. కొన్నాళ్ల నుంచి అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం తుదిశ్వాస విడిచారు. హైదరాబాద్‌కు చెందిన వేణుగోపాల్‌రెడ్డి అదిలాబాద్ ఏజెన్సీ ఏరియాలో పని చేస్తుండగా 317 జీఓలో రెండేళ్ల క్రితం మహబూబ్‌నగర్ జిల్లాకు కేటాయించారు. ఇక్కడికి వచ్చిన ఆయనకు అడ్డాకుల బాధ్యతలు అప్పగించగా ఇటీవల ఆయన క్వాలిటీ కంట్రోల్‌కు బదిలీ అయ్యారు. ఇంతలోనే అనార్యోగంతో తుదిశ్వాస విడిచారు. మండల నాయకులు, అధికారులు సంతాపం వ్యక్తం చేశారు.

బస్సును ఢీకొని వ్యక్తికి గాయాలు

గండేడ్/మహమ్మదాబాద్: ప్రమాద వశాత్తు ఎదురుగా వస్తున్న బస్సును ఢీకొని ఓవ్యక్తికి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే సల్కర్‌పేట్‌కి చెందిన రాజు(24) గ్రామం నుంచి గండేడ్ వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో సబ్‌స్టేషన్ వద్ద బైక్ అదుపుతప్పింది. ఎదురుగా వస్తున్న బస్సును ఢీకొంది. దీంతో రాజు కుడి కాలు విరిగింది. స్థానికులు 108 అంబులెన్సుకు సమాచారం అందించారు. దీంతో మెరుగైన వైద్యం కోసం మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు.

కారు, ఆటో ఢీ : మరో ఇద్దరికి గాయాలు

గండేడ్/మహమ్మదాబాద్: కారు, ఆటో ఢీకొని ఇద్దరికి గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. మహమ్మదాబాద్ మండల పరిధిలోని నంచర్ల గ్రామానికి చెందిన విశాల్(14), సాయికల్యాణ్(17)లు ఆదివారం నాలుగు గంటల ప్రాంతంలో ఆటోలో కోస్గి వెళ్తున్నారు. ఈ క్రమంలో గండేడ్ మండలం జానంపల్లి వద్ద ఎదురుగా వస్తున్న కారు ఢీకొంది. దీంతో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు ఇద్దరిని 108 లో కోస్గి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

వ్యక్తికి రిమాండ్

మహమ్మదాబాద్: ఇంటిపక్క వ్యక్తిపై దాడి ఘటనలో ఓ వ్యక్తిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. వివరాల్లోకి వెళితే గండేడ్ మండల పరిధిలోని పెద్దవార్వాల్‌కి చెందిన కావలి నారాయణ ఈనెల 5న తన ఇంటిపక్క స్థలం విషయంలో లక్ష్మయ్యతో గొడవపడ్డాడు. అక్కడితో ఆగకుండా ఆయనపై దాడిచేసి గాయపరిచాడు. ఈ మేరకు బాధితుడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కాగా నారాయణపై కేసునమోదు చేసి రిమాండ్ తరలించినట్టు మహమ్మదాబాద్ ఎస్ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు.

పరామర్శ

బాలానగర్: ఉడిత్యాల మాజీ సర్పంచ్ మల్లేష్ యాదవ్ తల్లి ఇటీవలే మృతిచెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి లక్ష్మారెడ్డి ఆదివారం మల్లేష్ యాదవ్ కుటుంబాన్ని పరామర్శించారు. పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ రావు, వైస్ ఎంపీపీ వెంకటచారి, మల్లేష్ తదితరులు ఉన్నారు.

ముందుకు సాగని పనులు


పునాదుల వద్దే ఆగిన పనులు

- పునాదుల వద్దే ఆగిన సమీకృత మార్కెట్
- చాలీ చాలని స్థలంలో ఏర్పాటు

జడ్చర్ల: పట్టణంలో నిర్మించ తలపెట్టిన సమీకృత మార్కెట్ పనులు పునాదుల వద్దే ఆగిపోయాయి. ఇప్పటికే చాలీచాలని స్థలంలో దానిని నిర్మిస్తున్నారన్న ఆరోపణల నేపథ్యంలో.. పనులు ఆగిపోవడంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కూరగాయలు కొనుగోలు చేయాలంటే ఒక చోటుకు, మటన్ కొనాలంటే మరో చోటుకు చికెన్, చేపలు, పండ్లు, పూలు, పాలు కొనాలంటే వివిధ చోట్లకు వెళ్లాల్సిన పరిస్థితి లేకుండా.. అన్నీ ఒకే చోట లభించేలా గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం మూడేళ్ల కిందట సమీకృత(ఇంటిగ్రేటెడ్) మార్కెట్‌ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది.

పురపాలికలో సమీకృత మార్కెట్ ఏర్పాటుకు ప్రభుత్వం 2021లో రూ.4.50 కోట్లు మంజూరు చేసింది. దీంతో అధికారులు, పాలకులు సమీకృత మార్కెట్ యార్డును ఏర్పాటు చేసేందుకు కావలసిన స్థల ఎంపికపై కసరత్తు చేసి చివరకు మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఉన్న స్థలాన్ని ఖరారు చేశారు. అప్పటి ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి పనులకు శంకుస్థాపన చేశారు. దాదాపు మూడేళ్లు పూర్తి కావస్తున్నా ఎలాంటి పురోగతి లేదు. పనులు పునాదులకే పరిమితం అయ్యాయి. ఫుటింగ్ పనులు మాత్రమే పూర్తి చేసి వదిలేశారు. చేపట్టిన పనులలో కూడా నాణ్యత కొరవడిందన్న ఆరోపణలు ఉన్నాయి. అధికారులు కూడా పెద్దగా పట్టించుకోకపోవడం వల్ల ఫుటింగ్‌ల వద్దే ఇనుప చువ్వలు తుప్పు పడుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు.

సరిపడని స్థలం

సమీకృత మార్కెట్ యార్డు కొనసాగేందుకు కనీసంగా రెండు ఎకరాల స్థలం అవసరం ఉంది. కూరగాయలు, మాంసం, పూలు, పండ్లు, పాలు వంటి దుకాణాలకు వేర్వేరుగా షెడ్‌లు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. అదేవిధంగా కొనుగోలుదారులకు వీలుగా వాహనాల పార్కింగ్‌కు కూడా స్థలాన్ని కేటాయించాల్సి ఉంది. కానీ జడ్చర్లలో ఏర్పాటు చేస్తున్న మార్కెట్‌కు అంత స్థలం అందుబాటులో లేదు. ఎంపిక చేసిన స్థలంలో సైతం పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ విభాగాలకు చెందిన భవనాలను కూల్చివేసి పనులు చేపట్టారు.

క్రయవిక్రయాలకు ఇబ్బందులు

పట్టణంలో కూరగాయల క్రయవిక్రయాలకు ప్రస్తుతం ఇబ్బందులు తప్పడం లేదు. అటు అమ్మకం దారులు ఇటు కొనుగోలు దారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చే రైతులు ఎక్కడ అమ్ముకోవాలో తెలియని దుస్థితిని ఎదుర్కొంటున్నారు. బాదేపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డు రహదారిని అనుసరించి ప్రస్తుతం క్రయవిక్రయాలు సాగుతున్నాయి. కానీ ఇక్కడ మార్కెట్‌కు పంట దిగుబడుల రాక తరలింపు వలన వాహనాల రద్దీ తీవ్రంగా ఉంటుంది. అంతే గాక రైల్వేట్రాక్ పాయింట్ నుండి ఫర్టిలైజర్ బస్తాల తరలింపు కూడా ఇదే రహదారి గుండా కొనసాగుతుంది. దీంతో కూరగాయల క్రయవిక్రయాలకు అవరోధం కలుగుతోంది.

కాగా 167 జాతీయ రహదారిని అనుసరించి ఖాళీగా ఉన్న గాంధీ ట్రస్టు స్థలంలో సమీకృత మార్కెట్‌యార్డును ఏర్పాటు చేస్తే బాగుంటుందని పట్టణ వాసులు భావిస్తున్నారు. ఇక్కడ ప్రధాన జాతీయ రహదారిని అనుసరించి ఉన్న గాంధీ ట్రస్టు స్థలాన్ని తప్పడు రికార్డులు సృష్టించి కొందరు ఆక్రమించారన్న ఆరోపణలు ఉన్నాయి. స్థానిక ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి దీనిపై దృష్టి సారిస్తే ఆక్రమణ నుంచి స్థలాన్ని కాపాడడమే గాక ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ఏర్పాటుకు అనుకూలత లభించే పరిస్థితి ఉంటుందని పట్టణ వాసులు అభిప్రాయపడుతున్నారు.

మూతబడిన రైతు బజార్

రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన రైతుబజార్ మూతపడింది. రైతుబజార్ అటు ప్రజలకు ఇటు కూరగాయల క్రయవిక్రయదారులకు అనుకూలంగా లేకపోవడంతో అటువైపు కన్నెతి చూసేవారే కరువయ్యారు. ఇక్కడ కూరగాయల క్రయవిక్రయాలకు ఎంతమాత్రం అనుకూలంగా లేదు. దీంతో రైతుబజార్ కథ కంచికి చేరింది. ఈక్రమంలో పట్టణవాసులకు సమీకృత మార్కెట్ యార్డు అవసరం ఎంతైనా ఉంది. అధికారులు, పాలకులు స్పందించి పనులను వేగవంతం చేసి పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

కొనసాగుతున్న పీఓలు, ఏపీఓల శిక్షణ

జడ్చర్ల టౌన్: పట్టణంలోని డా.బీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి పీఓలు, ఏపీఓలకు శిక్షణ ఆదివారం కొనసాగింది. ఉదయం, మధ్యాహ్నం రెండు విడతల్లో ఇచ్చిన శిక్షణలో 6మంది గైర్హాజరు అయ్యారు. శిక్షణలో ఈవీఎంల పనితీరు, సీలింగ్, ఎన్నికలపై శిక్షణ ఇచ్చారు. పీఓలు, ఏపీఓల సందేహాలను నివృత్తి చేశారు. శిక్షణ రెస్పాన్సిబుల్ అధికారులుగా గోవర్ధన్‌గౌడ్, జగదీశ్వర్‌రెడ్డిలు వ్యవహరిస్తున్నారు. సయ్యద్ ఇబ్రహీం, లోక్యానాయక్, రవీందర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, శేషసేనారెడ్డి, శ్రీనివాసులు, శ్రీనివాసులుగౌడ్‌లు పీఓలు, ఏపీఓలకు శిక్షణ ఇస్తున్నారు. సోమవారం మరో రెండు విడతల శిక్షణ ఇవ్వనున్నారు.


శిక్షణలో పాల్గొన్న పీఓలు, ఏపీఓలు

వేద పాఠశాల ఏర్పాటుకు సహకరిస్తాం


తెలుగు సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

స్టేషన్ మహబూబ్‌నగర్: వేద పాఠశాల ఏర్పాటుకు సహకరిస్తానని, స్థలం కూడా ఇచ్చేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శ్రీవైష్ణవ వైఖానస బ్రాహ్మణ పరిషత్ ఆధ్వర్యంలో స్థానిక తెలంగాణ చౌరస్తాలో శ్రీవీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయం ప్రాంగణంలో ఆదివారం తెలుగు నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరణ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ధర్మాన్ని ముందు తరాలకు అందిస్తున్న మీరందరూ ధన్యులు అని అన్నారు. అనంతరం ఎమ్మెల్యేను శ్రీవైష్ణవ వైఖానస బ్రాహ్మణ పరిషత్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం చేశారు. కార్యక్రమంలో భాగ్యనగర అర్చక సంఘం అధ్యక్షులు శ్రీనివాసాచార్యులు, జిల్లా అధ్యక్షులు పవన్‌కుమార్ ఆచార్య, రమణమూర్తి, మణి ఆనంద్‌కుమార్, నర్సింహాచార్యులు తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని బ్రాహ్మణులకు ఉత్తరీయాలు సమర్పించారు. అదేవిధంగా జిల్లా కేంద్రంలోని వీరన్నపేటలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ ఎమ్మెల్యే పాల్గొన్నారు. ముస్లింలకు ఆయన ఖజూర్, పండ్లు తినిపించారు.

నీటి వనరులను రక్షించుకుందాం


మాట్లాడుతున్న డాక్టర్ వెంకటేశ్వర్లు

స్టేషన్ మహబూబ్‌నగర్: నీటి వనరులను రక్షించుకుందామని విశ్రాంత ఉపన్యాసకులు డాక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో ఆదివారం సుప్రభాత్ హెల్త్ క్లబ్ కన్వీనర్ జి.పాండురంగం ఆధ్వర్యంలో నీటి వనరులను రక్షించుకుందాం అనే అంశంపై సభ్యులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటేశ్వర్లు నీటి రక్షించుకొనే విధానంపై సూచనలు అందజేశారు. పాండురంగం మాట్లాడుతూ నీటిని వృధా చేయకుండా ప్రతి నీటిబొట్టును రక్షించుకుందామని కోరారు. ఈ వేసవిలో నీటిని రక్షించుకొనుటపై ప్రతి ఒక్కరూ కృషి చేద్దామని అన్నారు. కార్యక్రమంలో భారత్ వికాస్ పరిషత్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ చందర్, డాక్టర్ వెంకట్రామిరెడ్డి, యాదిరెడ్డి, అనంతరెడ్డి, శంకరయ్య, యాదయ్య, కుమార్, రవి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి

మరికల్: తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆశయాలను నిలబెట్టేందుకు విద్యార్థులు పట్టుదలతో చదివి అనుకున్న లక్ష్యాలను సాధించాలని డీఎస్పీ లింగయ్య అన్నారు. మండలంలోని ఆదివారం జరిగిన ప్రతిభ హైస్కూల్ వార్షికోత్సవ వేడుకల్లో ఆయన మాట్లాడుతూ.. పిల్లల భవిష్యత్‌కోసం ఎంతో కష్టపడి పనిచేసే తల్లిదండ్రుల ఆశయాలు నెరవేర్చే బాధ్యత విద్యార్థులపై ఎంతైన ఉందన్నారు. మారుతున్న కాలనుగుణంగా సెల్‌ఫోన్‌ను మంచికి వాడుకోవాలని, చేడుకు దూరంగా పెట్టాలన్నారు. ఎంతో ఉన్నతమైన విద్యాను అందిస్తున్న పాఠశాల ఉపాధ్యాయ బృందంతోపాటు గతేడాది పది ఫలితలో పదికి పది గ్రేడ్ సాధించిన ఐదు మంది విద్యార్థులను డీఎస్పీ సన్మానించి అభినందించారు. అనంతరం విద్యార్థులు వివిధ సంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించుకున్నారు. సీఐ రాజేందర్‌రెడ్డి, సూపరింటెండెంట్ శంకర్‌నాయక్, కరస్పాండెంట్ హన్మంతురెడ్డి, ప్రిన్సిపాల్ తమిల్‌రైన్ పాల్గొన్నారు.

విగ్రహాల అందజేత



మక్తల్: పట్టణంలోని చెక్కెర ఆంజనేయ స్వామి ఆలయంలో శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కల్యాణోత్సవం నిర్వహించేందుకు పట్టణానికి చెందిన సుజాత, ఆశన్న దంపతులు సొంత డబ్బులు రూ.లక్ష వెచ్చించి సీతారాముల, ఆంజనేయస్వామి విగ్రహాలను చేయించి ఆలయానికి అందజేశారు. విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. విగ్రహాలకు సంప్రోక్షణ కార్యక్రమం చేయించారు. ప్రాయశ్చిత, హోమం, మంగళహారతి, ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మామిళ్ల సుజాత, ఆశన్న దంపతులు, కుటుంబ సభ్యులు సుధీర్‌కుమార్, పృథ్వీరాజ్, వేదపడింతులు రాఘవేందర్ రావు, వంశీకృష్ణ, విద్వాన్, శేషగిరి, శ్రీనివాసులు, జగన్నాథ్, అంజన్‌ప్రసాద్, మహదేవ్, శ్రీధర్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

సేవా భావాన్ని అలవర్చుకోవాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): సమాజంలోని ప్రతి ఒక్కరు సేవా భావాన్ని అలవర్చుకోవాలని మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్ అన్నారు. తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి, రజకుల యువజన క్రాంతి సంఘం, పండగ సాయన్న సామాజిక సేవ సంస్థ సంయుక్తంగా ఆధ్వర్యంలో ఆదివారం కొత్త గంజ్‌లో మెగా హెల్త్ క్యాంపు నిర్వహించగా ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. యం.కె. ఆస్పత్రి డాక్టర్లు మహేష్ కుమార్, కరుణా రాథోడ్, వెంకట్ రవితేజ, జున్ను త్రివేది వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరం ఉన్న వారికి మందులను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, గోపి, కృష్ణముదిరాజ్, కౌన్సిలర్ నర్సింహయాదవ్, కేతూరి శివన్న తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు సన్మానం

దేవరకద్ర: కౌకుంట్ల మండల కేంద్రంలో ఆదివారం పారిశుద్ధ్య కార్మికులను ఘనంగా సన్మానించారు. తుమ్మల అరుణమ్మ జ్ఞాపకార్థం ఆమె భర్త కాంగ్రెస్ సీనియర్ నాయకులు తుమ్మల నరసింహారెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. కార్మికులను సన్మానించి కొత్త వస్త్రాలను, నగదు పారితోషికాలను పంపిణీ చేశారు. నాయకులు ప్రభు, ఆంజనేయులు, నరేష్, పుల్లారావు, భాగ్యమ్మ, శ్రీనివాస్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, సూరి, మన్నెపురెడ్డి కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు



స్టేషన్ మహబూబ్‌నగర్: వివేకానంద విద్యానికేతన్ స్కూల్ పూర్వ ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో స్థానిక రాజేంద్రనగర్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆదివారం రిటైర్డ్ ఎంఈఓ నారాయణ రావు ప్రారంభించారు. సంఘం ఆధ్వర్యంలో పలు సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు వినయ్‌కుమార్ తెలిపారు. గత 8 ఏళ్లుగా చలివేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు రత్నాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు నీలం రెడ్డి, సంఘం ఉపాధ్యక్షులు నాగరాజు, సభ్యులు శ్రీనివాసరాజు, అంజద్, నజీర్, శ్రీనివాస్, కిషోర్, విష్ణు, మురళీకృష్ణ, శ్రీను, నవీన్, నవాబ్‌ఖాన్, సుదర్శన్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రంలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే


అడ్డాకులలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి

అడ్డాకుల: కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాబోతోందని, రాహుల్‌గాంధీ ప్రధానమంత్రి అవుతారని ఆ పార్టీ మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి అన్నారు. నాయకులు, కార్యకర్తల బలంతోనే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని, అదే బలంతో ఎంపీ ఎన్నికల్లో విజయం సాధిస్తామని చెప్పారు. అడ్డాకులలో ఆదివారం జరిగిన అడ్డాకుల, మూసాపేట మండలాల పార్టీ విస్తృత స్థాయి సమావేశానికి ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డితో కలిసి ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే 30 లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తుందని తెలిపారు. ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పని చేయాలని కోరారు.

డీకే అరుణకు రాజకీయ భిక్ష పెట్టింది కాంగ్రెస్సే : ఎమ్మెల్యే జీఎంఆర్

డీకే అరుణకు రాజకీయ భిక్ష పెట్టి మంత్రిని చేసింది కాంగ్రెస్ పార్టీయేనని, అటువంటి పార్టీని తిట్టడం ఎంత వరకు సమంజసమని ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి ప్రశ్నించారు. కేంద్రంలో బీజేపీ రాదు... అవకాశవాది డీకే అరుణ ఎంపీగా గెలవదని జోస్యం చెప్పారు. రాముని పేరు చెప్పి ఓట్లడిగే వారిని ప్రజలు నమ్మొద్దని కోరారు. ఈసారి తప్పకుండా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందన్నారు. పదేళ్లలో చేయని పనులు ఇప్పుడు చేస్తామంటే బీజేపీని ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. బీజేపీ యువతను తప్పుదారి పట్టిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అరవింద్‌రెడ్డి, జగదీశ్, శ్రీహరి, శెట్టిశేఖర్, నాగిరెడ్డి, విజయమోహన్‌రెడ్డి, డీఎల్‌రెడ్డి, భీమన్న, దశరథ్‌రెడ్డి, బగ్గి కృష్ణయ్య, రామన్‌గౌడ్, హేమవర్ధన్‌రెడ్డి, రాధిక, శకుంతల తదితరులు పాల్గొన్నారు.

విద్య, వైద్యం ఉచితంగా అందించాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): సమాజంలో ప్రతి ఒక్కరికి ఉచిత విద్య, వైద్యం అందించడమే తమ పార్టీ ముఖ్య ఎజెండా ప్రగతి శీల సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ ఖాదర్ అన్నారు. ఆదివారం ఆ పార్టీ కార్యవర్గ సమావేశం జూమ్ మీటింగ్ ద్వారా జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ఎజెండాతో వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో 7 స్థానాల్లో తమపార్టీ తరపున అభ్యర్థులను బరిలో నిలుపుతున్నట్లు తెలిపారు. దేశంలో నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉందని నిరుద్యోగ సమస్య పరిష్కారం కోసం ప్రభుత్వాలు ప్రత్యేక కార్యాచరణను ప్రకటించాలని డిమాండ్ చేశారు. తమపార్టీ భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకుపోయేందుకు అనేక కార్యక్రమాలు చేసినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరికి అవసరమైయే విద్య, వైద్యం ఉచితంగా అందించడంలో ప్రభుత్వాలు ఎందుకు ఆలోచించడం లేదని ప్రశ్నించారు. ఈసమావేశంలో ఆయా జిల్లాలకు చెందిన అధ్యక్షులు పాల్గొన్నారు.

40 రోజులు కష్టపడి పనిచేయాలి



మిడ్జిల్: ప్రతి బీజేపీ కార్యకర్త 40 రోజులు కష్టపడి పనిచేసి డీకే అరుణ గెలుపు కోసం కృషి చేయాలని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి సూచించారు. ఆదివారం బోయిన్‌పల్లి గ్రామంలో బీకెఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. నాయకులు రవీందర్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, శేఖర్, మహేంద్రచారి, ఆంజనేయులు, శివ, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


జానంపేటలో సమావేశమైన పూర్వ విద్యార్థులు

బాలానగర్: మండల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో (2011–13 సంవత్సరానికి చెందిన) విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాటి అధ్యాపకులను శాలువాలతో సన్మానించారు. నాటి రోజులను గుర్తుచేసుకుని ఆనందంగా గడిపారు.

అడ్డాకుల: మూసాపేట మండలం జానంపేట ప్రాథమిక పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని నిర్వహించారు. 2001–02 బ్యాచ్ పదో తరగతికి చెందిన విద్యార్థులు సమావేశాన్ని నిర్వహించారు. చిన్ననాటి జ్ఞాపకాలను ఒకరితోనొకరు పంచుకున్నారు. నాడు వారికి చదువులు చెప్పిన గురువులు రామలింగం, వెంకట్రాములు, ఈశ్వర్‌రావు, శివరాములు, మంజుల, నారాయణ్‌జీ, రజాక్, వరలక్ష్మి, ఉషారాణి, సులోచనలను సమావేశానికి ఆహ్వానించి సత్కరించారు. పూర్వ విద్యార్థిని సావిత్రి భర్త చనిపోవడంతో ఆమెకు అదే బ్యాచ్‌కు చెందిన భానుచందర్ రూ.25వేలను అందజేశారు. అదేవిధంగా ప్రాథమిక పాఠశాలలో స్వీపర్ లేనందున పూర్వ విద్యార్థులందరు కలిసి రూ.10వేలను పాఠశాల కోసం అందజేశారు. కార్యక్రమంలో రమేష్, ఆంజనేయులు, నాగరాజు, శ్రీను, శ్రీకాంత్, నరేష్, మహేష్, రాకేష్, వీరేష్‌లు పాల్గొన్నారు.


బాలానగర్‌లో..

వెంచర్‌పై పోలీసులకు ఫిర్యాదు


మద్దిగట్ల శివారులో వెంచర్ వద్ద విచారణ చేస్తున్న పోలీసులు

భూత్పూర్: మండలంలోని మద్దిగట్ల శివారులోని ఇన్‌క్రిడిబుల్ ఇండియాకు చెందిన వారు గ్రామ పంచాయతీ అనుమతులు లేకుండా వెంచర్‌లు చేస్తున్నారని పంచాయతీ కార్యదర్శి గోపి ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. మద్దిగట్ల గ్రామ శివారు పరిధిలోని 11 సర్వే నంబర్లలో 88ఎకరాల్లో అనుమతులు లేకుండా వెంచర్ చేశారని గ్రామ కార్యదర్శి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు పేర్కొన్నారు. నోటీసులు జారీ చేశామని.. కానీ వాటిని చించివేశారని, ఇటీవల వెంచర్ల ప్రవేశ ద్వారం వద్ద ఇనుప బోర్డులు ఏర్పాటు చేసినా.. వాటిని వెంచర్ యజమాని తొలగించారని ఫిర్యాదులో వివరించారు.

సిగ్నల్‌గడ్డ వద్ద దుమ్ము కష్టాలు



జడ్చర్ల టౌన్: మండుతున్న ఎండలకు తోడు దుమ్మూధూళితో సిగ్నల్‌గడ్డ వాసుల కష్టాలు అంతా ఇంతా కాదు. 167వ నంబరు జాతీయ రహదారిపై ఎల్ఐసీ కార్యాలయం నుంచి డిగ్రీ కళాశాల వరకు 750మీటర్ల రోడ్డు విస్తరణ పనులు కొనసాగుతున్నాయి. పనుల్లో భాగంగా ఓ వైపు ఆర్‌యూబీ నిర్మాణాలు, మరోవైపు మెయింటెన్స్‌వాల్ పనులు చురుకుగా సాగుతున్నాయి. వీటితోపాటు రోడ్డును తవ్వటం, కంకర వేయటం చేస్తున్నారు. దీంతో దుమ్ము లేస్తుంది. రోడ్డుపై ఇటీవల వాహనాల రాకపోకల సంఖ్య భారీగా పెరిగాయి. ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లు, బస్సులతోపాటు రాయచూర్ నుంచి కోదాడ వరకు వెళ్లే భారీ వాహనాలు ప్రయాణం సాగిస్తున్నాయి. దీంతో కంకర వేసిన చోట పెద్ద ఎత్తున దుమ్ము లేస్తుంది. కాంట్రాక్టర్ రోడ్డు అంతా ఒకేసారి పనులు చేపట్టడంతో 750మీటర్ల మేర దుమ్ము లేస్తుంది. ఉదయం, సాయంత్రం ఒక్కో ట్యాంకర్‌తో నీళ్లు పొస్తున్నప్పటికీ మండుతున్న ఎండల కారణంగా అప్పుడే తడి ఆరిపోయి దుమ్ము మరింతగా లేస్తోంది. పనులు రాత్రిళ్లు చేపడితే సమస్య తీవ్రత కొంత తగ్గేది. ప్రస్తుతం రోడ్డంతా కంకర, డస్ట్ పరచటంతో దుమ్ము అధికంగా లేస్తుంది. దీనివల్ల రోడ్డుపై వెళ్లే వారితో పాటు రోడ్డుకిరువైపులా నివసిస్తున్న వారితో పాటు వ్యాపారస్తులు, సమీప కాలనీల్లోకి దుమ్ము వెళ్లి శ్వాసకోశ సంబంధ వ్యాధులతో ఇబ్బంధులు పడుతున్నారు. ఇదే విషయమై ఆదివారం అధికార, విపక్ష సభ్యుల మధ్య సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా వాగ్వాదం చెలరేగింది. ఒకరిపై మరొకరు దూషణలు చేసుకున్నారు. ప్రజలను ఇబ్బందులకు గురి చేయకుండా రోడ్డు పనులు చేపట్టేందుకు ఇప్పటికైనా మున్సిపల్ పాలకవర్గం, స్థానిక ఎమ్మెల్యే, జాతీయరహదారుల అధికారులు, కాంట్రాక్టర్‌లు చర్యలు తీసుకోవాల్సి ఉంది.